

20న స్వచ్ఛ దివస్‌ను నిర్వహించాలి

ప్రజాశక్తి-కాకినాడ

ఈ నెల 20న జిల్లాలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కింద స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా 3వ శనివారం స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సెప్టెంబర్‌లో మూడో శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం గ్రీన్ ఎపి అటవీకరణ ద్వారా పచ్చదనాన్ని ప్రోత్సహించండి అనే థీమ్‌తో నిర్వహించాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం ప్రజలందరికీ తెలిసే విధంగా టాంటాం వేయించాలని, ప్రకటనలు చేయించాలని సూచించారు.

వానొస్తే నగరం చెరువే..

- కాకినాడలో ముంపు సమస్య
- కానరాని నివారణ చర్యలు
- పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

మూడు రోజులుగా జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కాకినాడ స్మార్ట్ సిటీ పెద్ద ఎత్తున ముంపునకు గురవుతోంది. పలు డివిజన్లు ముంపు నీటిలో కొట్టుమిట్టాడుతున్నాయి. గత టిడిపి ప్రభుత్వ హయాంలో సుమారు రూ.1000 కోట్లతో స్మార్ట్ సిటీని అభివృద్ధి చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో సైతం కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. కానీ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం మాత్రం యంత్రాంగం చూపలేకపోతోందని నగరవాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 50 డివిజన్లుగా విస్తరించి ఉన్న కాకినాడ నగరపాలక సంస్థ 31.69 చ.కిమీ విస్తీర్ణంలో ఉంది. ప్రస్తుతం సుమారు 5.5 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. ఇక్కడ సుమారు 101 మురికివాడలు ఉన్నాయి. 300 కిలోమీటర్ల మేర మురుగునీటి కాలువలు ఉన్నాయి. నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశామని పాలకులు గొప్పలు చెబుతున్నా ముంపు సమస్యను మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. వర్షాకాలం సీజన్ వచ్చిందంటే చాలు నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వర్షపు నీరు నిల్వ ఉండిపోవడంతో మోకాళ్లోతు నీటిలోనే బయటకు రాకపోకలు సాగిస్తున్నారు. మరోవైపు వ్యాధుల భయంతో ఆందోళన చెందుతున్నారు. పలు కాలనీలు వారాలు, నెలల తరబడి ముంపులోనే ఉంటున్నాయి. మూడు రోజులుగా నగరంలో పెద్ద ఎత్తున వర్షాలు పడుతున్నాయి. దీంతో ప్రధాన రహదారులు సైతం ముంపు నీటిలో కొట్టుమిట్టాడుతున్నాయి. స్థానిక మైనేజర్ బ్రిడ్జి కింద వర్షపు నీరు నిల్వ ఉండిపోవడంతో మూడు రోజుల నుంచి ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. మెయిన్ రోడ్డు పైన సైతం ఇరువైపులా వర్షం నీరు నిల్వ ఉండిపోవడంతో ఆయా షాపులకు వెళ్లే వినియోగదారులు అవస్థలు పడాల్సి వస్తోంది. సినిమా రోడ్డు, శాంతినగర్, రామారావుపేట, పాత బస్టాండ్, గాంధీనగర్, రేచర్లపేట, సాంబమూర్తినగర్, పర్లోపేట, దుమ్ములపేట, సంజయ్ నగర్, ఏటిమొగ, రామకృష్ణారావుపేట, వెంకటేశ్వరకాలనీ, కచేరీపేట, గొల్లపేట, టీచర్స్ కాలనీ, బ్రికీ కాలనీ, ఎస్.అచ్యుతాపురం, మహాలక్ష్మినగర్, లక్ష్మీనగర్, వెంకటనగర్, గోడారిగుంట తదితర ప్రాంతాలు ప్రస్తుతం ముంపులో కొనసాగుతున్నాయి. జగన్నాథపురంలోని నివాసముంటున్న కాకినాడ సిటీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు ఇంటి ముందు సైతం మోకాళ్లోతు నీరు నిల్వ ఉండిపోతోంది. దీంతో అటుగా వెళుతున్న ప్రయాణికులు, స్థానికులు ఎంఎల్ఎ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీల్లో పూడిక పనులు సక్రమంగా నిర్వహించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడుతోందంటూ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం సీజన్లలో ఏటా ఇలా ముంపు సమస్యను ఎదుర్కొంటున్నప్పటికీ అధికారులు శాశ్వత పరిష్కార మార్గాలను చూపలేకపోతున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంత కాలం ఇలా ముంపు, మురుగునీటితో సహవాసం చేయాలని ప్రశ్నిస్తున్నారు. శ్రీనగర్, వివేకానంద పార్క్, టూ టౌన్ పోలీస్ స్టేషన్, బాలా త్రిపుర సుందరి టెంపుల్, భాస్కర్ నగర్ తదితర ప్రాంతాలలో పెద్ద ఎత్తున ఆక్రమణలు జరిగాయి. దీంతో డ్రైనేజీ వ్యవస్థ మూసుకుపోతోంది. వర్షం కురిసినప్పుడల్లా నగరం అంతా ముంపునకు గురవుతోంది. ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆక్రమణలపై అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతోనే ఈ సమస్య మరింత పెరుగుతూ ఉందంటూ నగరవాసులు అంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ముంపు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఆందోళన బాట పడతామంటూ హెచ్చరిస్తున్నారు.



కాకినాడ జగన్నాథపురంలో మోకాలి లోతులో ఉన్న కాలనీ

సాగునీటి చెరువుల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలోని సాగునీటి చెరువుల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. సాగునీటి చెరువుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన మరమ్మతులు, ఆధునికీకరణ, నీటి నిల్వల సామర్థ్యం పెంచడం పథకంపై గురువారం కాకినాడ కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ ఇరిగేషన్, ప్రణాళిక, వ్యవసాయం, బిసి కార్పొరేషన్, పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ భూగర్భ జలాల శాతాన్ని పెంచడం, ఆయకట్టు స్థిరీకరణ, ఆయకట్టును పెంచడం ద్వారా సమగ్రాభివృద్ధి సాధించే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సాగునీటి చెరువుల అభివృద్ధికి చర్యలు చేపట్టాయన్నారు. ఈ పథకం ద్వారా సాగునీటి చెరువులకు మరమ్మత్తులు, ఆధునికీకరణ, నీటి నిల్వల సామర్థ్యం పెంచేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ పథకం అమలులో భాగంగా కాకినాడ జిల్లాలో తొలి దశ కింద 50 సాగు నీటి చెరువులను గుర్తించి, ఈ చెరువులకు సంబంధించిన సమగ్ర వివరాలను సేకరించేందుకు ఇరిగేషన్, వ్యవసాయం, ప్రణాళిక, సర్వే ఇతర శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టి సాగునీటి చెరువుల సమగ్ర వివరాలతో కూడిన నివేదికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. సిపిఒ పి.త్రినాథ్, ఎ.శ్రీనివాసరావు, ఎస్ఎస్ఎ ఎపిఒ, ఇన్‌ఛార్జి పాడా పీడీ పి.వేణుగోపాలరావు, సర్వే ఎడి శ్రీనివాసు, ఇరిగేషన్ డిఇలు ఎ.రవికుమార్, సంతోష్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్ సగిలి

జిల్లాలో 4 గ్రామాల్లో మ్యాజిక్ డ్రైన్

ప్రజాశక్తి - జగ్గంపేట

జిల్లాలో నాలుగు గ్రామాలను ఎంపిక చేసి మ్యాజిక్ డ్రైనేజీని నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్లు డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి తెలిపారు. మ్యాజిక్ డ్రైన్ నిర్మాణానికి మండలంలోని గోవిందపురం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడంతో ఆ గ్రామ గిరిజన కాలనీని ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్‌తో కలిసి ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సాధారణ డ్రైనేజీ నిర్మాణానికి వంద మీటర్ల పొడవుకు రూ.5 లక్షల వరకూ ఖర్చు అవుతుంటే మ్యాజిక్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.లక్ష కంటే తక్కువ ఖర్చు అవుతుందన్నారు. ఈ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణంతో గ్రామాలలో దోమల బెడద పూర్తిస్థాయిలో తగ్గుతుందన్నారు. అనంతరం జగ్గంపేట శివారు కోనేటి వద్ద చేపట్టిన పార్కు నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామ్‌జీ, గోవిందపురం సర్పంచ్ కమ్మెల వెంకటేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న డ్వామా పీడీ

పాఠశాలల అభివృద్ధికి పివివి కృషి

ప్రజాశక్తి - జగ్గంపేట

ఎక్కడ ఉద్యోగ విధులను నిర్వహించిన ఆ పాఠశాల అభివృద్ధి కోసం ఉపాధ్యాయుడు పివివి.సత్యనారాయణ కృషి చేస్తుంటారని పలువురు ప్రశంసించారు. కాండ్రేగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణను గురువారం పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పాఠశాల అభివృద్ధికి ఆయన సుమారు రూ.8 లక్షల సొంత నిధులు ఖర్చు చేసి అన్ని వసతులూ సమకూర్చారన్నారు. ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాల అయ్యే విధంగా కృషి చేశారన్నారు. ఉపాధ్యాయునిగా పివి మాస్టారు అందించిన సేవలు చిరస్థాయిగా గుర్తుంటాయని ప్రశంసించారు. అనంతరం పివి మాట్లాడుతూ తాను మొదటిసారిగా ఉద్యోగ జీవితం ప్రారంభించిన కాండ్రేగుల గ్రామానికి రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పివివిని సన్మానించిన ఉపాధ్యాయులు, గ్రామస్తులు

పి4 స్కీమ్‌పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

పి4 స్కీమ్‌పై పూర్తిస్థాయిలో అందరికీ అవగాహన కల్పించాలని ఆర్‌డిఒ శ్రీరమణి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో డివిజన్ స్థాయిలో 40 మంది సచివాలయ సిబ్బందికి పి4 స్కీమ్ యాప్, పి4 వినియోగంపై గురువారం ఒకరోజు శిక్షణా కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఈ స్కీమ్‌పై పూర్తిస్థాయిలో అవగాహన పెంచడం ద్వారానే ఈ స్కీమ్ విజయవంతం అవుతుందన్నారు. శిక్షణ పొందిన 40 మంది వారి మండలాల పరిధిలో పి4 సిబ్బందికి శిక్షణ ఇస్తారన్నారు. ఈ సందర్భంగా ఆమె ఈ స్కీముకు సంబంధించి మార్గ నిర్దేశకాలను వివరించారు.

నేడు, రేపు లేఖర్ల పెన్ డౌన్

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోపభూయిష్టమైన 2.0 రిజిస్ట్రేషన్ విధానం వల్ల ఏర్పడుతున్న ఇబ్బందులు నేపథ్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో దస్తావేజు లేఖర్లు పెన్ డౌన్ ఆందోళనకు దిగుతున్నారు. ఈ విషయాన్ని గురువారం సామర్లకోట దస్తావేజు లేఖరుల సంఘం నాయకులు మల్యాల సీతాపతి రావు, గోగు అప్పారావు, షేక్ అమీర్, పేకేటి చినపుత్రయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు దస్తావేజు లేఖర్లకు రిజిస్ట్రేషన్ సమయంలో ఒటిపిలు బహిర్గతం చేయడానికి సంకోచిస్తున్నారు. ఆటో మ్యూటేషన్ సిస్టం చాలా మంచిదే కానీ సమన్వయం లోపం వల్ల చాలా ఇబ్బందులు వస్తున్నాయన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కాకినాడ

రాష్ట్రంలో వీరోచితంగా అంగన్‌వాడీలు చేసిన 42 రోజుల సమ్మె సందర్భంగా కూటమి ప్రభుత్వం రాసిచ్చిన హామీలను, కూటమి ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబీ రాణి డిమాండ్ చేశారు. గురువారం నిర్వహించిన యూనియన్ తొమ్మిదో జిల్లా మహా సభలో ఆమె మాట్లాడారు. జిల్లా అధ్యక్షురాలు దడాల పద్మ ఫెడరేషన్ జెండాను ఆవిష్కరించి సభను ప్రారంభించారు. అనంతరం ఎంఎల్‌సి షేక్ సాబ్జికి, సీతారాం ఏచూరి తదితర అమరులకు నివాళులు అర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుబండి చంద్రావతి మూడేళ్ల పోరాటాల కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం సభలో పలువురు నాయకులు మాట్లాడారు. కుట్రలను తిప్పికొట్టడానికి, సమస్యలు పరిష్కరించుకోవడానికి అంగన్‌వాడీలు పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రూ.26 వేల వేతనం చెల్లించాలని, ఐసిడిఎస్‌ను సంస్థాగతం చేసి 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలిగా దడాల పద్మ, ప్రధాన కార్యదర్శిగా ఎరుబండి చంద్రవతి, కోశాధికారిగా గేదెల రామలక్ష్మి, 30 మందితో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్, కోశాధికారి మలకా రమణ, దారపురెడ్డి క్రాంతి, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణ, టి.రాజా, పలివెల వీరబాబు, రొంగల ఈశ్వరరావు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, భారతి, వేణి, నాగలక్ష్మి, ఉమ, కృష్ణవేణి, ఎస్తేరు రాణి, దాడి బేబీ, చాముంతి, జ్యోతి, బుల్లెమ్మ, లక్ష్మి, సావిత్రి, నాగమణి, ధనలక్ష్మి, మేరీ సమాధానం, రాజేశ్వరి పాల్గొన్నారు.



నూతన అధ్యక్ష కార్యదర్శులు పద్మ, చంద్రావతి



అంగన్‌వాడీ యూనియన్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

సమస్యలపై ఉపాధి కూలీల ధర్నా

ప్రజాశక్తి -కరప

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధి కూలీలు గురువారం ధర్నా నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి వేతనాలు వెంటనే విడుదల చేయాలని, ఉపాధి పనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సలాది శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. ధర్నాను ఉద్దేశించి ఎపి వ్యవసాయ జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, కార్యదర్శి కమిడి సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉపాధి హామీ చట్టం ప్రకారం పనులు చేసిన 15 రోజుల్లో వేతనాలు చెల్లించాల్సి ఉంటే మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి స్థాయిలో చెల్లించలేదన్నారు. గతంలో ఉన్న సదుపాయాలన్నీ తొలగించడమే కాక కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రోజుకు రూ.307 వేతనం కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రస్తుతం ప్రతి వేతనదారుకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ బకాయిలు ఉన్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధి కార్మికులు ఏమి తిని బ్రతకాలని ప్రశ్నించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఇలాంటి ఉద్యమాలు జరుగుతున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ వేతనాలు మొత్తాన్ని విడుదల చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మందనక్క జగ్గారావు, దేవు నారాయణ, ఎర్రమశెట్టి వెంకట్రావు, దాసరి సింహాద్రి, గుబ్బల విష్ణు, మేడిశెట్టి వెంకటేశ్వరరావు, పేపకాయల వీరభద్రం, కనికెళ్ల అప్పారావు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న ఉపాధి కూలీలు

1న 'వాహన మిత్ర' నగదు జమ

ప్రజాశక్తి-కాకినాడ

ఎపి ప్రభుత్వం ఆటో, మోటార్ క్యాబ్, మాక్సీ క్యాబ్ వాహనదారుల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వాహన మిత్ర ద్వారా రూ.15,000 ఆర్థిక సాయం అక్టోబర్ 1న అందిస్తామని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా గతంలో లబ్ధి పొందిన వాహనదారులకు వారు ఇచ్చిన బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా నగదు జమ చేస్తారన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకొనేవారు ఈ నెల 19లోగా గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కొత్త దరఖాస్తులను ఈ నెల 22 వ తేదీన మండల స్థాయిలో, 24న జిల్లా స్థాయిలో పరిశీలన చేసి అర్హత కలిగిన లబ్ధిదారులకు 2025 అక్టోబరు 1న వారి బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తారని తెలిపారు.

ఎంపిడిఒగా సెలాట్‌రాజు బాధ్యతలు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

ఎంపిడిఒగా నీతిపూడి సెలాట్ రాజు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రామచంద్రపురంలో ఇఒపిఆర్‌డిగా పని చేసి ప్రమోషన్‌లో భాగంగా పిఠాపురం ఎంపిడిఒగా వచ్చారు. ప్రస్తుతం డిప్యుటేషన్‌పై గొల్లప్రోలు ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించారు.

దసరా ఉత్సవాలకు పట్టు వస్త్రాల సమర్పణ

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం సత్యదేవుని సన్నిధిలో అధికారులు నిర్వహించే దసరా ఉత్సవాలకు దాత రూ.2.75 లక్షల విలువైన పట్టు వస్త్రాలను సమర్పించారు. విజయవాడ చెందిన రావాడ చిరంజీవి దంపతులు గురువారం కొండపైన ఈ వస్త్రాలను దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావుకి అందించారు. వీటిని త్సవాల్లో స్వామివారి ప్రధానాలయం యంత్రాలయం వనదుర్గ కనకదుర్గ అమ్మ వాళ్లకు వినియోగిస్తామని ఇఒ సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కోట సుబ్బయ్య, ఎఇఒ భాస్కరం సిబ్బంది పాల్గొన్నారు

హిజ్రాలకు పోలీసుల కౌన్సిలింగ్

ప్రజాశక్తి-శంఖవరం

సమాజంలో హిజ్రాలు గౌరవప్రదంగా జీవన విధానం అలవర్చుకోవాలని అన్నవరం పోలీసులు వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రత్తిపాడు సిఐ సూరి అప్పారావు, ఎస్ఐ హరిబాబు అన్నవరం పరిసర ప్రాంతాలలో సంచరిస్తున్న హిజ్రాలతో సమావేశం ఏర్పాటు చేశారు. హిజ్రాలు వివాహ కార్యక్రమాలు, ఇతర శుభకార్యాలలో బలవంతపు వసూళ్లకు పాల్పడరాదని, జాతీయ రహదారిపై వ్యభిచారం చేయరాదని, దారి దోపిడీలు, దొంగతనాల్లో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వం తరపున సాయం అందిస్తామని, ప్రత్యామ్నాయ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.

కార్టూ'నిజం'



సమస్యలు పరిష్కరించాలని విఆర్‌ల ధర్నా

తమ సమస్యలు పరిష్కరించాలని విఆర్‌ఎలు గురువారం తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

పిఠాపురం విఆర్‌ఎల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు అప్పలస్వామి, రాజారత్నం మాట్లాడారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ న్యాయమైన సమస్యల పరిష్కారంలో భాగంగా రెండు రోజులపాటు ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దూలపల్లి సత్తియ్య, కె.తమ్మారావు, నీలం సూర్యనారాయణ, వేమగిరి తాతారావు, కొమ్ముకూరి శేషారత్నం, గోపాన నూకరత్నం, బండి అబ్బులు, ఎస్‌డి బాషా పాల్గొన్నారు.

యు.కొత్తపల్లి విఆర్‌ఎలు తహశీల్దారు కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు.



తాళ్లరేవులో ధర్నా చేస్తున్న విఆర్‌ఎలు

గండేపల్లి తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. శ్రీనివాస్, బాబ్జి పాల్గొన్నారు.

తాళ్లరేవు తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు యండమూరి శేషయ్య, మడికి రాంబాబు మాట్లాడారు. మోర్త పండు బాబు, సిద్ధన బాబూరావు, మురమళ్ళ సునీత దేవి, పండవలస సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

పెద్దాపురం విఆర్‌ఎల అసోసియేషన్ అధ్యక్షుడు దువ్వాపు వీరబాబు మాట్లాడారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, సర్వేయర్ దేవుడు సంఘీభావం తెలిపారు. నిడమర్తి సురేష్, ప్రధాన కార్యదర్శి గెడ్డం బాబూజీ, సంఘం నాయకులు సుందరపల్లి రామలింగేశ్వరరావు, గంపల వీరబాబు, సాయి భువన్, నూకతట్టు వెంకటరమణ, గొర్ల సత్యవేణి, షేక్ బీబీ పాల్గొన్నారు.



పెద్దాపురంలో ధర్నా చేస్తున్న విఆర్‌ఎలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పోషకాహారం ద్వారా ఆరోగ్య పరిరక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

పోషకాహారం ద్వారా శరీర ఆరోగ్యం పరిరక్షణ సాధ్యమని ఐసిడిఎస్ సిడిపిఒ జి.ఉష అన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ మాసోత్సవంలో భాగంగా కట్టమూరులో గురువారం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ టివి.రమణమ్మ అధ్యక్షతన నిర్వహించిన పౌష్టికాహారంపై అవగాహన, ఎగ్జిబిషన్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో పౌష్టికాహార విలువలతో కూడిన ఆహారం పొందవచ్చన్నారు. అక్టోబర్ 16వ తేదీ వరకూ ఈ పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ చంద్ర కిరణ్, డాక్టర్ ఉష మాట్లాడుతూ శరీర ఆరోగ్యానికి అవసరమైన ఆహార పదార్థాల గురించి వివరించారు. ఏయే ఆహార పదార్థాలలో ఏయే పోషక విలువలు ఉంటాయో వివరించారు. అనంతరం నిర్వహించిన వైద్య శిబిరంలో వారు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం, సానిపిని రామకృష్ణ, సుందరపల్లి శివ నారాయణ, బిక్కిన శేషు కుమారి, గోలి తాతారావు, అడపా శివ, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.



ముద్రగడను కలిసిన నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి : గిరిబాబు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

నియోజకవర్గంలో ప్రజల నుంచి వస్తున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైసిపి కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మాజీ మంత్రి వైసిపి పిఎసి సభ్యుడు ముద్రగడ పద్మనాభంను కిర్లంపూడిలో గురువారం శంఖవరం జెడ్‌పిటిసి ఈగల అప్పారావు కలిశారు. నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును రౌతులపూడి, ప్రత్తిపాడు, శంఖవరం మండలాల వైసిపి నాయకులు కలిశారు. గిరిబాబుకు నియోజకవర్గంలో ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని గిరిబాబుకి వివరించారు. గిరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం తప్ప చేసింది ఏమీ లేదన్నారు. హామీలను అమలు చేయలేక కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వాసిరెడ్డి భాస్కర బాబు, సర్పంచ్ కొరుప్రోలు దేవుడు, రామిశెట్టి నాని పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నకిలీ ఎస్ఐ గుట్టురట్టు

పోలీసులకు చిక్కిన కేటుగాడు

ప్రజాశక్తి- కొవ్వూరు

పోలీస్ యూనిఫామ్ వేసుకుని నకిలీ ఎస్ఐ అవతారం ఎత్తి హైవేపై వాహనాల నుంచి సొమ్ములు వసూలు చేస్తున్న కేటుగాడిని కొవ్వూరు రూరల్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపిన వివరాలు ప్రకారం... ధవలేశ్వరంలోని బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న సరెళ్ల సంజయ్‌రాజు అనే వ్యక్తి నకిలీ పోలీస్ అవతారం ఎత్తి మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. మంగళవారం అర్ధరాత్రి జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై ఆపి నిద్రిస్తున్న ఐసర్ వ్యాన్ డ్రైవర్‌ను సంజయ్‌రాజు బెదిరించి సొమ్ములు కాజేశాడు. ఆ సమయంలో ఐసర్ వ్యాన్ డ్రైవర్‌కు అనుమానం వచ్చి నకిలీ ఎస్ఐ వచ్చిన బైకు నెంబర్‌ను నోట్ చేసుకున్నాడు. రూరల్ పోలీసులను ఆశ్రయించడంతో కేటుగాడి గుట్టు బయటపడింది. నిందితుడు సంజయ్ రాజును అరెస్టు చేసి కొవ్వూరు కోర్టులో హాజరుపరిచామన్నారు. నిందితునికి రిమాండ్ విధించారని తెలిపారు. రాజమండ్రి వన్ టౌన్, త్రీ టౌన్, రాజానగరం, రావులపాలెం, శ్రీకాకుళం జెఆర్‌పురం పోలీస్ స్టేషన్‌ల్లో నిందితునిపై కేసులు ఉన్నాయన్నారు. 24 గంటల్లోనే నకిలీ ఎస్ఐను పట్టుకున్న పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మోటార్ సైకిల్ పై వెళుతున్న యువకుడిని వ్యాన్ ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగర పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి 216 పై రాజుపాలెం సెంటర్ వద్ద మోటార్ సైకిల్ మెకానిక్‌గా పని చేస్తున్న గుబ్బల పవన్ కుమార్ (27) మోటార్ సైకిల్‌పై రాజుపాలెంలోని తన ఇంటికి వెళుతున్నాడు. ఎదురుగా వస్తున్న వ్యాన్ అతివేగంగా వచ్చి ఢీ కొట్టి, పక్కనే ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు ఈడ్చుకుని వెళ్లిపోవడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని శవ పంచానమా నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు.



విజిలెన్స్ సిబ్బంది సీజ్ చేసిన లారీలు

40 టన్నుల యూరియా స్వాధీనం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని తాటిపర్తి, వన్నెపూడిలో యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండగా బుధవారం రాత్రి విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ ఐ.గోపాలకృష్ణ, వ్యవసాయ శాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులు దాడులు నిర్వహించారు. తాటిపర్తి పెద్ద చెరువు దగ్గర యూరియాతో ఉన్న రెండు లారీల్లో 40.250 టన్నుల యూరియా బస్తాలను గుర్తించారు. యూరియా బస్తాలను శ్రీనాగదుర్గ పురుగు మందుల షాపు వారు అధిక ధరకు అమ్మకాలు చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. రెండు లారీలను సీజ్ చేశారు. వారిపై 6 ఎ కేసు నమోదు చేసినట్టు సిఐ జి.శ్రీనివాస్ ఎస్ఐ లక్ష్మణ స్వామి తెలిపారు. ఈ దాడుల్లో పిఠాపురం వ్యవసాయ శాఖ ఎడి పి.స్వాతి, ఎఒ కెవివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

బొబ్బిల్లంకలో చోరీ

ప్రజాశక్తి - సీతానగరం

బొబ్బిల్లంక గ్రామానికి చెందిన లంకే రాంబాబు ఇంట్లో చోరీ జరిగిందని బుధవారం సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం రాంబాబుకు కుటుంబం కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం గ్రామంలో బంధువులు ఇంటికి వెళ్లింది. బుధవారం స్వగ్రామైన సీతానగరం మండలం బొబ్బిల్లంకలో ఇంటికి వచ్చారు. ఇంటి పైకప్పు పెంకులు తొలగించి ఉండటం గమనించారు. లోపలికి వెళ్ళి చూడగా రూ.50వేల నగదు, నాలుగు గ్రాముల బంగారం, వెండి పట్టీలు, వెండి గ్లాసు, వెండి ప్లేటు అపహరణకు గురైయ్యాయని గుర్తించాడు. వెంటనే పోలీసులు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రామ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



వేడుకల్లో పాల్గొన్న సిబ్బంది

ఆదర్శ్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలులో ఆదర్శ్ ఇంజినీరింగ్ కళాశాలలో బి.టెక్ విద్యార్థులకు ఫ్రెషర్స్ డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ బుర్రా అనుబాబు హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఈ వయసులో కష్టపడి చదవాలని, ఫలితంగా ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. జీవితంలో విద్యార్థి దశ చాలా విలువైనదని, ఈ దశలో తీసుకునే నిర్ణయాలే వారి భవిష్యత్తును నిర్ణయిస్తాయనారను. కళాశాల డైరెక్టర్ బుర్రా అఖిలేష్ మాట్లాడుతూ విద్యా విలువలను పెంపొందించడం కోసం ఎంతో శ్రమకోర్చి ఈ కళాశాలను స్థాపించామని, ఎందరో విద్యార్థులను ఇంజనీర్లుగా తీర్చిదిద్దామని తెలిపారు.

యానాం వార్తలు



అన్నదానంలో పాల్గొన్న మల్లాడి కృష్ణారావు

భీమ్ నగర్‌లో అన్నదానం

ప్రజాశక్తి - యానాం

స్థానిక బీమ్ నగర్‌లో గణపతి నవరాత్రులు ఘనంగా ముగిసిన సందర్భంగా శ్రీ సిద్ధి వినాయక ఆలయ సముదాయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పాల్గొన్నారు. సిద్ధి వినాయక ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు ఆలయ సముదాయ కమిటీ ప్రతినిధులు మల్లాడి కృష్ణారావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లంక బంగారం, పువ్వల శ్రీనివాస్, మందపల్లి వీర్రాజు, పువ్వల బైరమూర్తి, పువ్వల గంగరాజు, వేపాటి వెంకటేశ్వర్లు, కొంకుపూడి గాంధీ పాల్గొన్నారు.



క్రికెట్ క్రీడాకారులతో మాట్లాడుతున్న మల్లాడి కృష్ణారావు

క్రికెట్ మైదానం అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - యానాం

యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ సమస్యలను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు గురువారం మెట్టకూరు హైస్కూల్ గ్రౌండ్‌లో సమావేశమై మల్లాడి కృష్ణారావుకు క్రీడాకారుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ క్రికెట్ మైదానం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. క్రికెట్ గ్రౌండ్ చుట్టూ 30 అడుగుల ఎత్తు మెస్ ఏర్పాటు, వర్షం నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ,టార్ఫ్ పిచ్, టెన్నిస్ బాల్ పిచ్ నిర్మాణం, గ్రౌండ్‌ను పూర్తిగా బ్రౌన్ సోయిల్‌తో సరి చేయడం, లైట్స్‌తో కూడిన ప్రాక్టీస్ నెట్స్ పూర్తిగా లాక్ అయ్యే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు.

ఉచిత దుస్తులకు బదులు నగదు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం ఆది ద్రావిడ వెల్ఫేర్, షెడ్యూల్ ట్రైబ్స్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ద్వారా ఎస్‌సిలకు దీపావళికి ఇచ్చే ఉచిత దుస్తులకు బదులు నగదు జమ చేయనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ రేకాడి కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, బ్యాంక్ ఎకౌంట్, వయసు నిర్ధారణ సర్టిఫికెట్లు కాపీలను ఈ నెల 25లోగా కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

మెడికల్ కాలేజీలకు పిపిపి విధానం వద్దు

ప్రజాశక్తి - సామర్లకోట

ఎపి మెడికల్ కాలేజీలను పిపిపి విధానంలో నడపకూడదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పిడిఎస్‌యు ఆధ్వర్యాన గురువారం ధర్నా చేశారు. గాంధీ బొమ్మ సెంటర్‌లో నిర్వహించిన ఈ నిరసనలో రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 17 మెడికల్ కాలేజీలను పిపిపి విధానంలో ప్రైవేటుకు అప్పగించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ రంగంలో ఉంటే 2400 మెడికల్ సీట్లు కన్వీనర్ కోటా ద్వారా రిజర్వేషన్ ప్రాతిపదికన అందుబాటులోకి వస్తాయని, కానీ పిపిపి విధానంలో సీట్లు ప్రైవేటు కాలేజీల మాదిరిగానే ఉండి సామాన్యులకు అందుబాటులో ఉండవని పేర్కొన్నారు.

సబ్ జైల్‌ను సందర్శించిన జడ్జి



సబ్‌జైలును సందర్శించిన జడ్జి శ్రీలక్ష్మి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం సబ్ జైలును గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి శ్రీలక్ష్మి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ముద్దాయిలతో నిర్వహించిన సమావేశంలో వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముద్దాయిలకు పెట్టే ఆహార పదార్థాలు, మంచినీరు, సదుపాయాలు, సబ్ జైల్ పరిసరాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ రమణబాబు, అడ్వకేట్ ప్రభుజీ, పారా లీగల్ వాలంటీర్ డి.లక్ష్మి పాల్గొన్నారు.

నేడు ఉద్యోగుల పిజిఆర్ఎస్ కార్యక్రమం

ప్రజాశక్తి-కాకినాడ

ప్రభుత్వం సూచనల మేరకు ప్రతినెలా 3వ శుక్రవారం ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 19న కాకినాడ కలెక్టరేట్‌లో ప్రభుత్వ ఉద్యోగుల పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. 19వ తేదీ శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకూ కలెక్టరేట్‌లోని వివేకానంద హాల్లో ఉద్యోగుల సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామన్నారు. ఈ అంశాన్ని గమనించి ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

ఎంపిపి, సర్పంచులకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మండల కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ఎంపిపిలు, సర్పంచులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. కొన్ని మండలాలను ఎంపిక చేసి మూడు విడతలుగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఎంపిక చేసిన ఎంపిపిలు, సర్పంచులకు రెండు రోజులపాటు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణా తరగతుల్లో భాగంగా గురువారం పెద్దాపురం, ప్రత్తిపాడు, రౌతులపూడి మండలాల పరిధిలోని ఎంపిపి, సర్పంచులకు శిక్షణ ఇచ్చారు. ఎం.భైరవమూర్తి, ఎం.శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణా తరగతులలో పంచాయితీ అభివృద్ధి ప్రణాళికల అమలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంచాయతీల పరిధిలో నిర్వహించే తొమ్మిది బృందాల సర్వేలకు సంబంధించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ జివి.శేఖర్ రెడ్డి, ఎఒ ఎం.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా రోడ్డుపై గుంతల పూడ్చివేత

ప్రజాశక్తి-కాకినాడ

మెయిన్ రోడ్డులోని జెమినీ ప్లాజా సెంటర్‌లో ప్రధాన రహదారిపై రెండు భారీ గుంతలను ఆఫీసర్స్ క్లబ్ షటిల్ బ్యాడ్మింటన్ సభ్యులు సొంత ఖర్చులతో గురువారం పూడ్చివేశారు. 8 నెలలుగా అక్కడ అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నట్టు వారు తెలిపారు. ఇసుకపల్లి భాస్కర్, బచ్చల శేఖర్, బచ్చల శ్రీను, ఉడతా రామకృష్ణ, ఇమ్మతి శ్రీధర్ రెడ్డి, బి.సురేష్ కుమార్, లీలాకృష్ణ పాల్గొన్నారు.

టవర్ నిర్మాణం వద్దంటూ నిరసన

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట అయోధ్యరామపురం పుంత రోడ్డులో నిర్మిస్తున్న సెల్ టవర్ నిర్మాణ పనులను స్థానిక ప్రజలు గురువారం అడ్డగించారు. తక్షణం పనులు ఆపాలని కార్మికులను పట్టుబట్టారు. సెల్ టవర్ నిర్మాణం వల్ల రేడియేషన్ పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నందున ఇళ్ళ సమీపంలో టవర్ నిర్మాణం చేపట్టరాదన్నారు. దీంతో తాత్కాలికంగా టవర్ నిర్మాణ పనులను నిలిపివేశారు.

పౌష్టికాహారం అందించాలి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

ఒబేసిటీ బారిన పిల్లలు పడకుండా పౌష్టికాహారం అందించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మానసాదేవి తెలిపారు. గురువారం పట్టణంలోని గాంధీనగర్ ఏరియాలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ లక్ష్మి పిఠాపురం సిడిపిఒ దుర్గాదేవి ఆధ్వర్యంలో పోషణ మహా కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా మానసాదేవి మాట్లాడుతూ పిల్లలకు ఆరోగ్యకరమైన పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా ఒబిసిటీ బారిన పడకుండా నివారించవచ్చని తెలిపారు. ఈ పోషణ మహా కార్యక్రమం నేటి నుండి అక్టోబర్ 16 వరకూ నిర్వహిస్తామన్నారు.

పలువురికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పిఠాపురం

మండలంలోని కోలంకలో గురువార ఉచితం దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నిర్వహించిన వైద్య శిబిరంలో నిస్సి దంత వైద్యశాల ఆధ్వర్యంలో డాక్టర్ జ్యోతి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, పేస్టులు పంపిణీ చేశారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఔత్సాహికులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పరిశ్రమల శాఖ ఐపిఒ రాజేష్ అన్నారు. తాళ్లరేవు మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉద్యమ్ ఆధార్ రిజిస్ట్రేషన్ ప్రారంభం సందర్భంగా ఎపిఎం కెవికె.శైలేష్ అధ్యక్షతన నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. పరిశ్రమలు స్థాపించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, ఆయా సబ్సిడీలు పొందడానికి ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. 21 రోజుల్లో అన్ని అనుమతులు పొందే సౌలభ్యం ఉన్నట్టు తెలిపారు.

సర్టిఫికెట్స్ పడిపోయినది

కాకినాడ జిల్లా, రౌతులపూడి మండలం, ములగపూడి గ్రామానికి చెందిన కాపరపు గణపతి గారి కుమారుడు కాపరపు భానుప్రకాష్ నేను S.C. మాల కులానికి చెందినవాడిని. నేను D.M.L.T. చదువుతున్నాను. అయితే జులై 14-7-2025వ తేదీన సదరు ఒరిజినల్ మార్క్ లిస్టు కాలేజీలో సబ్మిట్ చేయుటకు ములగపూడి నుండి తుని బైక్‌పై వెళ్తుండగా మార్గ మధ్యలో నా యొక్క మార్క్ లిస్టు పోయినది. ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

నా అడ్రసు: శ్రీ కాపరపు భానుప్రకాష్
S/o. శ్రీ కాపరపు గణపతి, ములగపూడి గ్రామం
రౌతులపూడి మండలం, కాకినాడ జిల్లా
సెల్: 8886120544

మహిళా సంఘాల్లో 'మన డబ్బులు- మన లెక్కలు'

ప్రజాశక్తి-సామర్లకోట

మహిళా సంఘాల్లో అప్పులు, జమలు, పొదుపు తదితర అంశాలపై మన డబ్బులు మన లెక్కలు యాప్ యాప్ ద్వారా నమోదు చేపట్టినట్టు డిఆర్‌డిఎ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ టి.అశోక్ భరత్ తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా గురువారం పండ్రవాడ, బోయినపూడి, మాధవపట్నం, వేట్లపాలెంలో ఐదు గ్రామ సంఘాలను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నట్లు భరత్ చెప్పారు. ప్రతి నెలా సంఘంలో సభ్యులు కడుతున్న చందా వివరాలు, తీసుకున్న రుణం, చెల్లిస్తున్న వాయిదాల వివరాలను ఎప్పటికప్పుడు ఈ యాప్‌లో నమోదు చేస్తామన్నారు. గ్రామానికి సంఘాల్లో పారదర్శకత కోసం కూటమి ప్రభుత్వం ఈ విధానాన్ని అమలులోకి తెచ్చిందని చెప్పారు. ఐదు గ్రామాఖ్య సంఘాల సభ్యులకు యాప్‌లో వివరాల నమోదుపై అవగాహన కల్పించారు. ఇందిర, కుసుమ, కళవతి, సిహెచ్ జగదీశ్వరి, చైతన్య, రమేష్, శాంతి, చినబాబు పాల్గొన్నారు.

పాఠశాలలో స్వచ్ఛాంధ్ర బృందం

ప్రజాశక్తి - సామర్లకోట

ఉండూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలను స్టేట్ టీమ్ షేహేంషా ఆధ్వర్యంలో గురువారం సందర్శించారు. దీనిలో పాఠశాలలోని బాలికలు, బాలుర జండర్ వైజ్ మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి సదుపాయం, హ్యాండ్ వాషింగ్ స్టేషన్స్ విత్ సోప్, పాఠశాలలో ట్విన్ బిన్ ఇన్‌స్టాలేషన్, స్టూడెంట్ లెడ్ స్వచ్ఛత క్లబ్స్, కాంపెయిన్స్, రొటీన్ శానిటేషన్ లాగ్ వెరిఫికేషన్, అటల్ టింకరింగ్ ల్యాబ్, ఒకేషనల్ కోర్స్ ల్యాబ్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానిస్తున్న గ్రంథాలయ సభ్యులు

ప్రభుత్వ కొలువు సాధకులకు సన్మానం

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని శ్రీసూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలోని పాఠకులు పోటీ పరీక్షలకు పుస్తకాలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ కొలువులను సాధించడం హర్షించదగ్గ విషయం అని గ్రంథాలయ సభ్యులు అన్నారు. గురువారం గ్రంథాలయ ఆవరణలో కొలువుల సాధకులను సన్మానించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధ్యక్షుడు బాదం ఉదయ సూర్యప్రకాష్ మాట్లాడుతూ మధ్య తరగతికి చెందిన పోటీపరీక్షలపై ఆసక్తి చూపే అభ్యర్థులకు ఏ విధమైన రుసుమూ వసూలు చేయకుండా వసతి, పుస్తకాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు ఉపయోగించుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో గ్రంథాలయంలో పోటీ పరీక్షల విభాగం ఆశయం నెరవేరిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి కొండేపూడి శంకరరావు, సభ్యులు వెన్నపు చక్రధర్, సత్య రామచంద్రరావు, అల్లవరపు నగేష్, కె.అప్పారావు, కె.ప్రసాద్, సుబ్బారావు, రవీంద్రబాబు, గట్టి శ్రీకృష్ణ దేవరాయులు, నాగేశ్వరావు పాల్గొన్నారు.

జల వనరుల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - సామర్లకోట

విద్యార్థి స్థాయిలోనే జలసంరక్షణ ఆవశ్యకత తెలుసుకుని వాటి వినియోగం, పొదుపుపై ప్రతి ఒక్కరూ సమిష్టిగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, స్థానిక పిఎంశ్రీ బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయిరామ కృష్ణ అన్నారు. గురువారం స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా ప్రపంచ నీటి పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వర్షపు నీటి సంరక్షణ, మరుగుదొడ్ల వాడకం, పరిశుభ్రత, హ్యాండ్ వాష్ అంశాలపై అవగాహన కల్పించారు. పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.గంగాభవాని, బిఆర్ఎస్ శివకుమార్, సిహెచ్.బబిత, ఎన్.ప్రశాంతి పాల్గొన్నారు.



స్వచ్ఛత పక్వాడాలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పిఎం ఆవాస్ యోజనపై పోటీలు

ప్రజాశక్తి - సామర్లకోట

అంగీకార్-2025 ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-అర్బన్ 2.0 పథకంపై ప్రజలలో అవగాహన పెంచడానికి ఉద్దేశించి పట్టణంలోని యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 2.0 పథకంపై విద్యార్థులకు ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య అవగాహన కల్పించారు. అనంతరం ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య, హెచ్ఎం కె.శ్రీదేవి, విద్యా కమిటీ చైర్మన్ కె.కన్నబాబు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, పిఎంఎవై రత్న, ఉపాధ్యాయులు కె.అరుణ, ఎఎల్‌వి.కుమారి, యు.నాగమణి, క్రాంతి ప్రియ, రామలక్ష్మి పాల్గొన్నారు.



పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత